అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన దళిత నాయకులు
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నియోజక వర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

బడంగ్‌పేట, డిసెంబర్ 20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రాజ్యసభలో అవమానించిన బీజేపీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేషరత్‌గా క్షమాపణ చేసి పదవికి రాజీనామా చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మతోన్మాద మంత్రికి బుద్ధి ప్రసాదించాలని ఎద్దేవా చేశారు. జిల్లెలగూడలో నల్ల రిబ్బన్స్ ధరించి నిరసన తెలిపారు. తుక్కుగూడలో అంబేద్కర్ ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టి ధర్నా చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మంత్రులు ఇలా మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే దేశ ప్రజలను అవమానించినట్లే అవుతుందన్నారు. అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజక వర్గం ఇన్‌చార్జి కేఎల్ఆర్, బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, కార్పొరేటర్ పెద్ద బావి సుదర్శన్ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, దయాసాగర్ రెడ్డి, దళిత సంఘాల నాయకులు గజ్జల రాంచందర్ యంగల యాదగిరి, జనార్దన్, రాజలింగం, గొట్టె యాదయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

- ఎల్బీనగర్: అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ క్షమాపణలు చెప్పాలని మన మాలల సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్శపు శ్రీధర్, అధికార ప్రతినిధులు రాసమల్ల శ్రీనివాస్, సంగి పేట్ నరేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాతను తన వాఖ్యలతో కించ పర్చారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్నామని, తాము ఏది చెప్పిన చెల్లుతుందని భావించడం వారి అహంభావానికి నిదర్శనమన్నారు. అంబేద్కర్‌ను ప్రపంచవ్యాప్తంగా కొనియాడుతుంటే ఈ దేశంలో మాత్రం నాయకులు ఇలా వ్యవహరిచడం శోచనీయమన్నారు.
- మన్సూరాబాద్, అక్టోబర్ 20: అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరుతూ శుక్రవారం ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఎల్బీనగర్ నియోజకవర్గం మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు నాలుకల నర్సింగ్‌రావు, ప్రధానకార్యదర్శి జంగిలి కిషన్, ఉపాధ్యక్షుడు చెంగల్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బేర బాలకిషన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అత్యధిక స్థానాలు గెలుచుకుని అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బీజేపీ నాయకులు చేసిన ప్రచారాన్ని ఇప్పటికైనా కోట్లాది మంది దళితులు గ్రహించాలన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే కుట్రలో భాగంగానే నిండు సభలో కేంద్ర మంత్రి అమిత్‌షా కుట్ర పూరితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం మాల సంఘాల జేఏసీ నాయకులు గంగం శివ శంకర్, కట్ట వెంకటేశ్, మిద్దెల నర్సింహ, నల్లాల కుమార్, సంతోష్, మొగిళ్ల మల్లేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

తుక్కుగూడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు, నేతలు

- కందుకూరు: అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మండల కేంద్రంలో నిరసనలు మిన్నంటాయి. సీపీఎం జిల్లా నాయకుడు రాంచందర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కుమార్, బాల్ రాజ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ ఎండీ అష్జల్ భేగ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షాను తక్షణమే మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్మ సమాజ్ వాది పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ అమరేందర్ నాయకులు కార్యకర్తలు నిసనను వ్యక్తం చేశారు. అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమార్, జగదీశ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.
- ఆర్కేపురం: అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దుబ్బాక శేఖర్, డోర్నాల చంద్రమౌళి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి సూచనలతో ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆయనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. పున్న గణేశ్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, తల్లాటి రమేశ్‌నేత, సురేందర్‌రెడ్డి, ఎస్.కె. మహ్మద్, శివ, అక్బర్, లింగస్వామిగౌడ్, షఫీ, శ్యామ్‌గౌడ్, విప్లవ్ పాల్గొన్నారు.
- కందుకూరు : అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సల్ అధికార ప్రతినిధి యాదగిరి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీకి దళితులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఇలాంటి వాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు అంబేద్కర్ అంటే ఎంతో అభిమానమని తెలిపారు.

అమిత్ షాను వెంటనే తొలగించాలని నినాదాలు చేస్తున్న రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్

కందుకూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు రాంచందర్, శ్రీనివాస్, కుమార్, క్రిష్ణ,

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ అష్జల్ బేగ్, కుమార్, ధర్మ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ అమరేందర్

జిల్లెలగూడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

బడంగ్‌పేటలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు, మేయర్ పారిజాత

ఎన్టీఆర్‌నగర్ చౌరస్తాలో అమిత్ షాకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహదారుల అభివృద్ధికి కృషి

కాచిగూడ, డిసెంబర్ 20: అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న అన్ని రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్‌లోని అంజుమాన్ బాడలో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్లలో ఉన్న బస్తీలు, కాలనీల్లో ఇప్పటికే చాలా వరకు సీసీ, బీటీ, వీడీసీసీ రోడ్లను నిర్మించామన్నారు. అలాగే డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను కూడా నెలకొల్పామని చెప్పారు. ఐదేండ్లుగా చేసిన అభివృద్ధే కాకుండా ఇంకా ఏయే బస్తీలలో రోడ్ల నిర్మాణం, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటు కాలేదో గుర్తించి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి వారికి సూచనలు చేశామన్నారు. పాదయాత్రల ద్వారా గుర్తించిన సమస్యలకు ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు మంజూరుకు పంపించామని చెప్పారు.

విదేశీ భాషల డిప్లామా కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని విదేశీ భాషల డిప్లామా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్ డిప్లామా, సీనియర్ డిప్లామా, అడ్వాన్స్‌డ్ డిప్లామా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

చిన్నారులకు క్రీడా సామగ్రి ఏర్పాటు

క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డి

సైదాబాద్, డిసెంబర్ 20 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-ఏ కాలనీ, సీ-కాలనీలోని పార్క్‌ల్లో నూతనంగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులను శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాలనీల్లోని పార్క్‌లను అభివృద్ధి చేసి చిన్నారుల కోసం ఆట వస్తువులను సమకూర్చుతున్నట్లు తెలిపారు. పిల్లలకు ఆటలపై శ్రద్ధ కల్పించినప్పుడే వారు అన్ని అంశాల్లో ప్రతిభ చూపిస్తారని తెలిపారు. రెండు కాలనీల్లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలించి, వాటి నాణ్యత వంటి అంశాలను తెలుసుకొని కాలనీవాసులకు, జీహెచ్ఎంసీ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు కిరణ్‌కుమార్, రవి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎంఎన్ చారి, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో క్రిస్మస్ సంబురాలు

సైదాబాద్, డిసెంబర్ 20 : పర్వదినాలను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సోదర భావంతో జరుపుకోవాలని హైదరాబాద్ సౌత్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్) ఎస్ఈ సోమిరెడ్డి అన్నారు. మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్ సిటీ-8 విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల, మతాలకతీతంగా పండుగలను జరుపుకోవటం ద్వారా ప్రతి ఒక్కరిలో మత విశ్వాసాలను గౌరవించే సంస్కృతి పెరుగుతుందని, ప్రజల మధ్య సోదర భావంతో పాటు మత సామరస్యాం పెరుగుతుందన్నారు. రాక్‌చర్చి మినిస్ట్రీస్ బిషప్ తిమోతి మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగానే ప్రజల్లో రోజు రోజుకు దైవభక్తి పెరుగుతుందన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవ సోదరులకు, విద్యుత్ శాఖ అధికారులకు, కార్మికులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ సర్కిల్ ఏఎస్‌వో చంద్రుడు, ఆస్మాన్‌ఘడ్ డివిజన్ డీఈ విష్ణు వర్ధన్ రెడ్డి, చార్మినార్ డీఈ శ్రీధర్, టెక్నికల్ డీఈ రాంబాబు, బేగంబజార్ డీఈ ఫరాత్ అలీ, ఏఈలు సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, సంతోష్‌బాబు, కార్యక్రమ నిర్వాహకులు జయపుత్ర, ప్రేమ్, విజయ్, జైసిన్, రామకృష్ణానంద్, రాజశేఖర్, రామ కృష్ణ, రాము, విజయ్, దాసు పాల్గన్నారు.

కిస్మస్ కేక్ కట్ చేస్తున్న సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి , రాక్‌చర్చి బిషప్ తిమోతి

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

వనస్థలిపురం, డిసెంబర్ 20 : హస్తినాపురం డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పలు కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయా పనులకు అంచనాలకు అనుగుణంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి పనిని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

పాత కక్షలతో దాడి.. ఇద్దరికి గాయాలు

ఎల్బీనగర్, డిసెంబర్ 20: పాత కక్షల నేపథ్యంలో రాజీ పడదామంటూ నమ్మబలికి అనంతరం కత్తులు, కొడవళ్లలో దాడి చేయగా ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఎన్టీఆర్‌నగర్ భరత్‌నగర్‌కు చెందిన బొడ్డు మహేశ్, ఆర్కేపురంకు చెందిన పగిళ్ల పురుషోత్తంలు గతంలో స్నేహితులు. 2022వ సంవత్సరంలో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పెళ్లి ఊరేగింపులో పురుషోత్తం, మహేశ్‌కు మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో పురుషోత్తం మహేశ్‌పై బీర్‌బాటిల్‌తో తలపై దాడి చేశాడు. ఈ విషయంలో హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో ఇరువర్గాలు సయోద్యకు రాగా పరస్పరం కాంప్రమైజ్ అయ్యేందుకు పురుషోత్తం నుంచి రూ. 50 వేలు నగదు తీసుకున్నారు. ఈ కేసు ఈ రోజు కోర్టులో పరిష్కారం కోసం రాగా మహేశ్ తల్లి కోర్టుకు వచ్చింది. మహేశ్ తాను సూర్యాపేట్‌లో ఉన్నానని రాలేనని చెప్పాడు. ఈ మేరకు కోర్టు నుంచి బయటకు వచ్చిన పురుషోత్తం తన స్నేహితులు రాము, నాగరాజు, బాలు, శ్రీను, ఆంజనేయులుతో కలిసి కొత్తపేట చౌరస్తా నుంచి మోహన్‌నగర్ రోడ్డులోని అమరావతి వైన్స్‌లో మద్యం సేవించి తిరిగి వెళ్లేందుకు కారులో ఎక్కేందుకు వెళ్తున్న క్రమంలో వీరిని వెంబడించి వచ్చిన బొడ్డు మహేశ్, దాసరి సురేందర్, బెల్లి భరత్‌తో పాటుగా మరికొందరు వీరి కారు వద్దకు వచ్చి తల్వార్‌లు, కొడవళ్లతో వీరిపై దాడికి దిగారు. విషయాన్ని గమనించిన పురుషోత్తం అక్కడి నుంచి పారిపోగా కారులోంచి పారిపోతున్న తుకారం గేట్‌కు చెందిన రాము, తట్టి అన్నారం ఆర్కేనగర్‌కు చెందిన నాగరాజులను వెంబడించి దాడి చేశారు. ఈ నేపథ్యంలో రాము గాయాలతో కొత్తపేటలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లోకి పరిగెత్తి తప్పించుకోగా, నాగరాజు మోహన్‌నగర్‌వైపు పరిగెత్తాడు. ఈ సంఘటనలో మహేశ్‌కు చేతులు, కాళ్లపై గాయాలు కాగా, నాగరాజుకు తలతో పాటుగా శరీరభాగాలపై గాయాలయ్యాయి. వీరిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. కాగా పారిపోయిన పురుషోత్తం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమపై దాడికి పాల్పడిన వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 20 : అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరుగుతున్న తీరును ప్రజలు పరిశీలించాలన్నారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జీహెచ్ఎంసీ నుంచి అధికంగా నిధులు తీసుకువచ్చి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మరి కొన్ని పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, సిబ్బంది, కాలనీ నాయకులు ఆరెకంటి వెంకట్‌రెడ్డి, నిట్టు కృష్ణ, సత్యనారాయణ, వెంకటేశ్‌గుప్తా, సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంహెచ్‌వోకు శ్రీనివాస్‌కు సన్మానం

జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఏఎంహెచ్‌వో (అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్) బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రుద్ర శ్రీనివాస్‌ను తెలంగాణ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మలక్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మలక్‌పేట బీ-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దిలీప్, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ జోన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, యాదగిరి, యాదయ్య, సంజయ్, గణేశ్, జంగయ్య, మహ్మద్ గౌస్ పాల్గొని డాక్టర్ రుద్ర శ్రీనివాస్‌కు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చి సన్మాన వేడుకల్లో పాల్గొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్ రెడ్డి, జవాన్ ఎం. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. -సైదాబాద్, డిసెంబర్ 20 :

23న మెగా జాబ్ మేళా

అంబర్‌పేట, డిసెంబర్ 20: యునైటెడ్ వే హైదరాబాద్(హంటర్) ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సోమవారం మెగా జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట ప్రేంనగర్, గ్రీన్‌ల్యాండ్స్ హోటల్ దగ్గర ఉండే కమ్యూనిటీహాల్ వద్ద ఈ జాబ్ ఫెయిర్ ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లామో, పీజీ చదివిన వారికి సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డాటా ఎంట్రీ, బీపీఓ, వాయిస్ ప్రాసెస్ అండ్ నాన్ వాయిస్ ప్రాసెస్, ఫ్రంట్ ఆఫీస్‌లలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్

కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నూతన కార్యవర్గ సభ్యులు

బడంగ్‌పేట, డిసెంబర్20: మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని తుక్కుగూడలో బ్రాహ్మణ అభ్యుదయ పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రంగారెడ్డి జిల్లా యువజన సంఘం కోశాధికారిగా ప్రదీప్ శర్మ, సంఘం అధ్యక్షుడిగా కురుమేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వంశీ శాస్త్రి, కోశాధికారిగా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా డేరం భాస్కర్ శర్మ, అంబా ప్రసాద్ శర్మ, శ్రీధర్ శర్మ, కార్యదర్శిగా ప్రదీప్ శర్మ, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

రక్తదానం మహాదానం

అన్నిదానాల్లో కెళ్లా రక్తదానం ఎంతో గొప్పదని షైన్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డా.ముస్తఫా అన్నారు. శుక్రవారం హెచ్‌సీఎల్-టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ముస్తఫా మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సూచించారు. ప్రమాదం జరిగిన సమయంలో సరైన సమయంలో రక్తం దొరకకపోవడంతో చాలా మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. తరుచూ రక్తం ఇవ్వడం వల్ల కొత్త రక్త కణాలు తయారవుతాయని దాని వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి విజయ్ తదితరులు ఉన్నారు.

-ఆర్కేపురం, డిసెంబర్ 20 :

సంత్ గాడ్గే బాబా ఆశయ సాధనకు కృషి చేయాలి

చంపాపేట, డిసెంబర్ 20: సంత్ గాడ్గే బాబా స్వచ్ఛభారత్ పితామహుడని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం సంత్ గాడ్గే వర్ధంతి సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లో భగత్‌సింగ్ యువజన సంఘం, బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంత్ గాడ్గే బాబా స్వచ్ఛభారత్ పితామహుడు చరిత్రలో పరిశుభ్రతే దైవమని నమ్మి చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడు గుడికి బదులు, బడిలో దొరికే ఆధ్యాత్మికథను వెతుక్కోవాలని సమాజానికి చాటి చెప్పిన తొలి సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా అన్నారు.